రంజాన్ వేళలు

శుక్రవారం	శనివారం
ఇఫ్తార్ :	సహర్ :
సా. 6.34	ఉ. 4.50

అల్లాహ్ మార్గంలో ఒక ఉదయం లేదా ఒక సాయంత్రం గడిపినందు వల్ల లభించే పుణ్యం ప్రపంచంలోని సంపదలన్నింటికన్న ఎంతో ఉత్తమం





అవిశ్వాసం.. నెగ్గేనా.. వీగేనా?

కామారెడ్డి, మార్చి 28(ఆంధ్రజ్యోతి):

కామారెడ్డి మున్సిపల్ రాజకీయం రసవత్తరంగా మారుతోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికై పాలక వర్గం సమావేశాన్ని అధికారులు నిర్వహించనున్నారు. అయితే కాంగ్రెస్ అవిశ్వాసం నెగ్గుతుందా లేదా వీగేపోతుందా అనే దానిపై ఉత్కంఠ నెలకొంటుంది. మరోవైపు కాంగ్రెస్‌కు మద్దతు తెలిపేందుకు బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు క్యాంపులో ఉన్నారు. ఇదేక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్రస్థాయి నేతలు సదరు కౌన్సిలర్‌లతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. కాంగ్రెస్‌కు మద్దతు తెలిపితే పార్టీ పరంగా విప్ జారీ చేస్తామని సదరు కౌన్సిలర్‌లకు రాష్ట్రస్థాయి నేతలు హెచ్చరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అవిశ్వాసానికి ముందే మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా చేస్తారా లేదా అవిశ్వాసాన్ని ఎదుర్కొంటారా అనే దానిపై సర్వత్ర చర్చసాగుతోంది. ఇదిలా ఉండగా అవిశ్వాసం నెగ్గితే కాంగ్రెస్‌లో చైర్‌పర్సన్ పదవిపై ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. చైర్‌పర్సన్ రేసులో నలుగురు కౌన్సిలర్లు గడ్డం ఇందుప్రియ, ఉరుదొండ వనిత, పాక జ్ఞానేశ్వరీ, మెహరుజ్ మెహర్ ఉన్నట్లు తెలుస్తోంది.

రేపు అవిశ్వాసం

అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీలోకి రోజురోజుకూ వలసలు పెరుగుతున్నాయి. ఇదేక్రమంలో పలు మున్సిపల్, సహకార సంఘాల చైర్మన్‌లపై అవిశ్వాసాలు పెడుతున్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు ఒక్కొక్కరిగా కాంగ్రెస్‌లో చేరుతూ వచ్చారు. దీంతో కాంగ్రెస్ మున్సిపల్‌లో బలం 27 మందికి చేరింది. మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై గత 15 రోజుల కిందట కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం నోటీసులను కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు అందజేసిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఉన్న కౌన్సిలర్లు చేయి జారకుండా కాంగ్రెస్ గత పక్షం రోజుల కిందటే కౌన్సిలర్‌లను క్యాంపునకు తరలించింది. అవిశ్వాసం పెట్టిన 15 రోజుల్లోపు చైర్మన్ అవిశ్వాసాన్ని నెగ్గేందుకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 30న చైర్‌పర్సన్ అవిశ్వాసాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని అధికారులు చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లకు నోటీసులు ఇచ్చారు. శనివారం చైర్‌పర్సన్‌పై అవిశ్వాసంపై కౌన్సిలర్లు మున్సిపాలిటీలో హాజరుకానున్నారు.

క్యాంపులోనే కౌన్సిలర్లు

కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని ఎలాగైన కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ వేగంగా పావులు కదుపుతోంది. బీఆర్‌ఎస్‌కు చెందిన సుమారు 23 మంది కౌన్సిలర్‌లను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఉన్న 27 మంది కౌన్సిలర్లు విహారయాత్ర నిమిత్తమై గోవాకు తరలివెళ్లారు. వీరంతా బుధవారం రాత్రి హైదరాబాద్‌కు వచ్చినట్లు తెలిసింది. వీరు అవిశ్వాసం రోజు నేరుగా మున్సిపల్‌కు కాంగ్రెస్ నేతలు తరలించనున్నారు. అయితే కాంగ్రెస్ అవిశ్వాసం నెగ్గాలంటే 34 మంది కౌన్సిలర్ల బలం ఉండాలి. కానీ ప్రస్తుతం కాంగ్రెస్‌కు 27 మంది కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. ఇదేక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లోని 10 మంది కౌన్సిలర్లతో సంప్రదింపులు జరిపారు. సదరు 10 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు తెలిపేందుకు సిద్ధమయ్యారు. వీరంతా గత వారం రోజుల కిందట క్యాంపుకై గోవాకు తరలివెళ్లారు. ఈ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సైతం శుక్రవారం ఉదయం వరకు హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

- రేపు కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం
- చైర్‌పర్సన్ వైపు ఐదుగురు కౌన్సిలర్లు
- క్యాంపులో మరో పది మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు
- వీరంతా కాంగ్రెస్‌కు మద్దతు తెలిపేనా?
- మద్దతు తెలిపితే బీఆర్‌ఎస్ కౌన్సిలర్లపై విప్ జారీ చేసే అవకాశం
- క్యాంపు రాజకీయాలపై బీఆర్‌ఎస్ రాష్ట్రస్థాయి నేతలు దృష్టి సారించిన వైనం
- చైర్‌పర్సన్ రాజీనామా చేసేనా.. అవిశ్వాసం ఎదుర్కునేనా?
- చైర్‌పర్సన్ రేసులో నలుగురు కౌన్సిలర్లు

బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మద్దతు తెలిపేనా?

కామారెడ్డి మున్సిపల్ పదవిని కాంగ్రెస్ కైవసం చేసుకోవాలంటే మరో 7 గురు కౌన్సిలర్ల మద్దతు కావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం కామారెడ్డి బల్దియాలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు 16 మంది ఉండగా బీజేపీకి చెందిన కౌన్సిలర్లు 6 గురు ఉన్నారు. ఇందులో బీజేపీ కౌన్సిలర్లు ఎలాగో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చే అవకాశం లేదు. అయితే బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు రెండు వర్గాలుగా చీలిపోయారు. ఇందులో 10మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే వారంతా క్యాంపునకు గోవాకు తరలివెళ్లారు. క్యాంపులో ఉన్న వీరికి బీఆర్‌ఎస్‌కు చెందిన రాష్ట్ర నాయకులు బుజ్జగింపులు జరిపినట్లు సమాచారం. అయితే సదరు కౌన్సిలర్లు ప్రస్తుత చైర్‌పర్సన్‌పై అసంతృప్తితో ఉన్నారు. చైర్‌పర్సన్‌కు మద్దతు ఇచ్చే పరిస్థితి లేదని రాష్ట్రనేతలకు తేల్చి చెప్పినట్లు సమాచారం. అయితే పార్టీలో ఉంటూ కాంగ్రెస్‌కు మద్దతు తెలిపితే బీఆర్‌ఎస్ తరఫున సదరు కౌన్సిలర్లపై విప్ జారీ చేసే అవకాశం ఉంటుందని బీఆర్‌ఎస్ వర్గాలు తెలుపుతున్నాయి. ఈ క్రమంలో పది మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతారా లేదా అనేది శనివారం వరకు వేచి చూడాలి.

చైర్‌పర్సన్ రాజీనామా చేసేనా.. అవిశ్వాసాన్ని ఎదుర్కొనేనా?

మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ అవిశ్వాసం పెట్టిన నేపథ్యంలో శనివారం అవిశ్వాసాన్ని చైర్‌పర్సన్ ఎదుర్కోవాల్సి ఉంది. అయితే కాంగ్రెస్‌కు ప్రస్తుతం 27మంది కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. అవిశ్వాసం నెగ్గాలంటే కాంగ్రెస్‌కు మరో 7 గురు కౌన్సిలర్లు కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం బీఆర్‌ఎస్ వద్ద 16 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అవిశ్వాసం రోజున బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఎవరు కూడా కాంగ్రెస్‌కు మద్దతు తెలుపకపోతే కాంగ్రెస్ అవిశ్వాసం వీగిపోనుంది. ఈ నేపథ్యంలో నిట్టు జాహ్నవి చైర్‌పర్సన్‌గా కొనసాగనుంది. అయితే క్యాంపులో ఉన్న బీఆర్‌ఎస్‌కు చెందిన పది మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు తెలిపేందుకు సిద్ధమయ్యారు. వీరిని మున్సిపల్ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేతలు బుజ్జగించే క్రమంలో ఉన్నారు. అయితే సదరు కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అసంతృప్తితో ఉన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రస్తుత చైర్‌పర్సన్‌కు మద్దతు తెలిపేది లేదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ప్రస్తుత చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవికి వీరి మద్దతులేకపోతే నేడు రాజీనామా చేసే అవకాశాలు ఉన్నాయి.



ఇంటి నుంచే ఓటు వేసేందుకు అవకాశం

- వృద్ధులు, దివ్యాంగులకు తప్పనున్న ఇబ్బందులు
- ఏప్రిల్ 22 వరకు దరఖాస్తుల స్వీకరణ

కామారెడ్డి టౌన్, మార్చి 28: వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల సంఘం ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. 85 సంవత్సరాలు పైబడిన వారు, దివ్యాంగులు, ఎవరైతే పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసేందుకు అవకాశం లేదో వారు తమ ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటు ఉంది. అందుకోసం ఏప్రిల్ 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది. వారి దరఖాస్తులను పరిశీలించి అన్నీ సవ్యంగా ఉంటే వారు తమ ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తామని పేర్కొంది.

బీఎల్‌వో, తహసీల్దార్ కార్యాలయాల్లో..

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 85 ఏళ్ల పైబడిన ఓటర్లు 10వేల వరకు ఉండగా దివ్యాంగులు 45వేల వరకు ఉన్నారు. వారి నుంచి ఎన్నికల అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారు. తహసీల్దార్ కార్యాలయాలు, బీఎల్‌వోల వద్ద దరఖాస్తులను సిద్ధంగా ఉంచారు. ఆధార్, ఎపిక్ కార్డు నెంబర్లతో దరఖాస్తును బీఎల్‌వోలకు లేదా తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తు ఆధారంగా సదరు వ్యక్తి ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు అర్హుడా కాదా అనే విషయాన్ని పరిశీలిస్తారు. అర్హత ఉంటే అతడికి ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

ఇంట్లో నుంచి ఓటింగ్ ఇలా..

పోలింగ్‌కు ముందుగానే దరఖాస్తుదారుల ఇళ్లకు రెవెన్యూ, పోలింగ్, పోలీసు సిబ్బంది వెళ్లి ఇంటి వద్దనే వారు ఓటు వేసే విధంగా అవకాశం కల్పిస్తారు. బ్యాలెట్ పేపర్‌తో పాటు పోలింగ్ బాక్సును వెంట తీసుకెళ్లి అక్కడ సదరు వ్యక్తి ఓటు వేసిన తర్వాత బ్యాలెట్ బాక్సును అతని ముందు ఉంచుతారు. బ్యాలెట్ పేపర్‌ను ఆ బాక్స్‌లో ఓటరే స్వయంగా వేస్తారు. సిబ్బంది ఆ బాక్స్‌ను ఆర్‌వో కార్యాలయంలో భద్రపరుస్తారు. కౌంటింగ్ రోజున ఆ బాక్స్‌ను తెరుస్తారు.



ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలి

కామారెడ్డి టౌన్, మార్చి 28: జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. రబీ సీజన్ 2023-24 ధాన్యం కొనుగోళ్లపై జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియామవళి అనుసరిస్తూ కొనుగోలు కేంద్రాలను అధికారులు, ఆయా శాఖల బాధ్యులు మాత్రమే ప్రారంభించాలని తెలిపారు. ఎక్కడ ప్రజాప్రతినిధులను ఆహ్వానించరాదని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్లు, తాగునీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలీన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్‌వో మల్లికార్జున్‌బాబు, మేనేజర్ నిత్యానంద్, సహకార అధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

వామ్మో.. ఆటోలు!

- జిల్లాలో పరిమితికి మించి ప్రయాణికుల ప్రయాణం
- అతివేగంగా నడుపుతూ.. ప్రమాదాలకు కారణమవుతున్న ఆటోలు
- ఆటో ప్రమాదాలతో అధిక ప్రాణ నష్టం
- నిబంధనలు పాటించని ఆటో వాలాలు
- పట్టించుకోని ఆర్‌టీవో, పోలీసు శాఖలు

కామారెడ్డి టౌన్, మార్చి 28: గత వారం రోజుల కిందట లింగంపేట మండలంలో పెళ్లికి వెళ్లి వస్తున్న ఆటో బోల్తాపడి ఇద్దరు మృతి చెందగా పలువురు గాయాల పాలయ్యారు. గురువారం సైతం ఇదే మండలంలో పెళ్లికి వెళ్తున్న ఆటో బోల్తా పడడంతో దాదాపు 10మంది వరకు తీవ్ర గాయాలపాలయ్యారు. జిల్లాలోని కొందరు ఆటోవాలాలు యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించి వేగంగా నడపడంతో వరుస రోడ్డు ప్రమాదాలకు కారకులు అవుతున్నారు. గతంలోనూ చాలా చోట్ల ఆటో ప్రమాదాలలో పలువురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. దీంతో ఆటోలో ప్రయాణించాలంటేనే జిల్లావాసులు బెంబేలెత్తుతున్నారు. ఆటో వాలాలు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న రవాణా, పోలీసుశాఖ అధికారులు మొక్కుబడిగా తనిఖీలు, చర్యలకు పరిమితమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కేవలం ప్రమాదం జరిగిన సమయంలోనే ఆడపాదడప తనిఖీలు చేసి మమ అనిపిస్తున్నారు. దీంతో ఆటో వాలాలు ఇష్టారాజ్యంగా నడుపుతున్నారనే వాదన ప్రయాణికుల నుంచి వినిపిస్తోంది.

తరచూ చోటు చేసుకుంటున్న ఆటో ప్రమాదాలు

జిల్లాలో ఆటో ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటుండడం ఆందోళన కల్గిస్తోంది. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం అతివేగంగా వెళ్లడం ప్రయాణికుల చావుకు కారణమవుతున్నారు. ఇందుకు నిదర్శనం గత 10 రోజుల వ్యవధిలో అధికలోడ్‌తో వెళ్తున్న ఆటోలు బోల్తాపడడమే. గతంలోనూ ఎల్లారెడ్డి మండలం పెద్దిరెడ్డి గ్రామం వద్ద ఇంటర్ పరీక్షలు రాసే ఐదుగురు విద్యార్థులతో ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో ఐదుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఓ విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆసుపత్రికి తరలించడం వల్ల ఇంటర్ పరీక్షకు దూరమయ్యాడు. ఇలాంటి ఆటో ప్రమాదాలు చాలానే జరిగాయి. సదాశివనగర్ మండలం ఎక్స్‌రోడ్డు వద్ద ఓ ఆటో లారీని ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందారు. టెక్రియాల్ జాతీయ రహదారిపై ఆటో బోల్తాపడడంతో ఒకరు మృతి చెందగా మరో 6 గురికి తీవ్ర గాయాలయ్యాయి. మాచారెడ్డి మండలం మంథన్ దేవునిపల్లి వాగు వద్ద ప్రమాదంలో పలువురు క్షతగాత్రులయ్యారు. ఇలా జిల్లాలో అనేక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

నిబంధనలను ఉల్లంఘిస్తున్న ఆటో వాలాలు

జిల్లాలోని సుమారు 1600లకు పైగా ఆటోలు, ట్రాలీ ఆటోలు, ఇతర గూడ్స్ ఆటోలు ఉన్నట్లు రవాణా శాఖ రికార్డులు చెబుతున్నాయి. చాలా మంది ఆటోవాలాలు నిబంధనలను ఉల్లంఘిస్తూ నడుపుతున్నారు. రవాణా శాఖ నిబంధనల మేరకు ఆటోలు పట్టణ ప్రాంతాల్లో, గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రయాణికులను ఎక్కించుకుని నడపాల్సి ఉంటుంది. కానీ జాతీయ, రాష్ట్ర రహదారులైన హైవేలపై నడపవద్దని నిబంధనలు ఉన్న వాటిని పాటించకుండా యథేచ్ఛగా హైవేలపై ఆటోలను తిప్పుతున్నారు. ఆటోలలో రవాణాశాఖ ప్రయాణికులను తరలించే విషయంలో పరిమితి విధించాయి. కానీ కొన్ని ఆటోల్లో ముగ్గురు మరికొన్నిట్లో ఆరుగురు, ఏడుగురిని తరలించే అవకాశం ఉంది. కానీ ముగ్గురు తీసుకెళ్లే ఆటోల్లో 8 మంది, ఆరుగురుని తరలించే దాంట్లో 15 మందిని ఎక్కిస్తున్నారు. డ్రైవర్ తప్పనిసరిగా యూనిఫాం ధరించి ఉండాలి. కొందరు డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా ఆటో నడపడంపై అవగాహన లేకున్నా నేరుగా రోడ్లు ఎక్కుతున్నారు. శుభకార్యాలు, విందుల కోసం పలువురు సరుకు రవాణా వాహనాల్లో తరలి వెళ్తున్నారు. ఈ క్రమంలో వాహనాల సామర్థ్యం, డ్రైవర్ అనుభవాన్ని పరిశీలించడం లేదు. విందు, వినోదాలకు వెళ్తుండడంతో డ్రైవర్ కూడా తాగేసి నడిపిస్తున్నారు. ఆటో వాహనాల కంపెనీల నుంచి వేగానికి పరిమితి విధించేలా స్పీడ్ లిమిట్ పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. పలువురు డ్రైవర్‌లు అత్యుత్సాహంతో వాటి వేగాన్ని తిరిగి పెంచుకుంటున్నారు. ఇలా యథేచ్ఛగా ఆటోవాలాలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా సంబంధిత శాఖలైన రవాణా, పోలీసు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అడపాదడప తనిఖీలు చేస్తున్నారే తప్ప ఆటో వాలాల ఆగడాలను అరికట్టలేక పోతున్నారు.



లింగంపేటలో జరిగిన ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు



అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర అడిషనల్ డీఆర్‌డీవో మోహన్‌రావు



384464

ఉపాధి పనుల్లో

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- రాష్ట్ర అడిషనల్ డీఆర్‌డీవో మోహన్‌రావు

రామారెడ్డి, మార్చి 28: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడవద్దని అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర అడిషనల్ డీఆర్‌డీవో మోహన్‌రావు హెచ్చరించారు. రామారెడ్డి మండలం కన్నాపూర్ గ్రామంలో ఉపాధి పథకం పనులను గురువారం సందర్శించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా పనుల విధానంపై ఆరా తీశారు. విధులు సక్రమంగా నిర్వహించని అధికారులపై ఫీల్డ్ అసిస్టెంట్‌లపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సవిత, ఏపీవో దర్మారెడ్డి, అధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



సాలూరలోని పదో తరగతి పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్ కలకలం!!

బోధన్ రూరల్, మార్చి 28: సాలూర మండల కేంద్రంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో గురువారం మాస్ కాపీయింగ్ కలకలం రేపింది. ఓ యువకుడు పాఠశాల ఫ్యాన్‌గా మారి విద్యార్థులకు చిట్టీలు అందించాడే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కోరారు.







ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

● కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్

ఎడపల్లి, మార్చి 28: నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యానికి ఎలాంటి తరుగు, కోతలు లేకుండా రైతుకు పూర్తి స్థాయిలో మద్దతు ధర దక్కేలా చూడాలని, రైతులు తాము పండించిన వరి పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధరను పొందాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. గురువారం ఎడపల్లి మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతి భవన కార్యాలయం ఎదుట ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం రైతులు కొనుగోలు కేంద్రంకు తెచ్చి ఆరబెట్టిన వరి ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ముందుగానే వరి దాన్యంలో తాలు, మట్టి బెడ్డలు లేకుండా చూసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ముందుగానే వరి దాన్యాన్ని పరిశీలించి రైతులను చైతన్య పరచాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. మిల్లర్లతో మాట్లాడి రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. ఇందులో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయాగౌడ్, సివిల్ సప్లైస్ డీఎం జగదీశ్, డీఎస్‌వో చంద్ర ప్రకాష్, జిల్లా సహకార శాఖ అధికారి సురేష్ కుమార్ ఎడపల్లి తహసీల్దార్ దన్వాల్, ఐకేపి డీపీఎం సాయిలు, ఏపీఎం సాయిలు, సెంటర్ ఇంచార్జి భాస్కర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి, జ్యోతి, సిఎ గాయత్రి, రైతులు, తదితరులున్నారు.





'బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలి'

రుద్రూరు, మార్చి 28: మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేయడం కోసం యువత ఐకమత్యంతో సమన్వయంతో దేశాభివృద్ధి కోసం కృషి చేస్తున్న బీజేపీని గెలిపించాలని బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్‌లో బీజేపీ జెండా ఎగరడ వేయడం కోసం నియోజకవర్గాల యువత కృషి చేయాలన్నారు. గురువారం మండల కేంద్రంలోని శశిరేఖ గార్డెన్‌లో రుద్రూరు, కోటగిరి, పొతంగల్ మండలాల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిబద్ధత, అంకిత భావంతో పనిచేసే కార్యకర్తలు బీజేపీ పార్టీలోనే ఉంటారని పేర్కొన్నారు. ప్రధాని మోదీని మరోసారి గెలిపించాలని కోరారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గం నాయకులు యెండల లక్ష్మీనారాయణ, కామారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షురాలు అరుణ తార, ప్రబారి మహిపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలుపుతూ బీజేపీ అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. అభ్యర్థి బీబీ పాటిల్ సమక్షంలో సుమారు 50 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు బీజేపీ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్లు, ప్రభావరీలు ముఖ్య నాయకులు, బీజేపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ మోర్చాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో ఉత్సాహంగా 5కే రన్

బోధన్ రూరల్, మార్చి 28: ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు వీలుగా భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం బోధన్ పట్టణంలో ఐ ఓట్ ఫర్ షుర్ అనే నినాదంతో 5కే రన్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, ఏసీపీ శ్రీనివాస్‌లు జెండా ఊపి 5కే రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అతికీలకమైందని, ఓటు హక్కును ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటు ఆయుధం లాంటిదని, మంచి నాయకున్ని ఎన్నుకుని ప్రగతి పథంలో ముందుకు సాగేందుకు ఓటు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహ సీల్దార్ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, పట్టణ సీఐ వీరయ్య, రూరల్ సీఐ కోల నరేష్, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ విద్యా సంస్థ లు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.









నేడు ఖిల్లా డిచ్‌పల్లి సొసైటీ సమావేశం

డిచ్‌పల్లి,మార్చి 28: ఖిల్లాడిచ్‌పల్లి సహకార సంఘ సర్వసభ్య సమా వేశం విండో చైర్మన్ రాంచందర్‌గౌడ్ అధ్యక్షతన నేడు 11గంటలకు జరగ నుందని సంఘ కార్యదర్శి కిషన్ ఒకప్రకటనలో తెలిపారు.ఈమహాజన సభకు పాలక వర్గ సభ్యులు రైతులు సకాలంలో హాజరుకావాలనికిషన్ కోరారు.

'మొక్క సుడిలో పడే విధంగా స్ప్రే చేయాలి'



మారంపల్లిలో సజ్జ పంటను పరిశీలిస్తున్న ఏవో జోష్నభవాని

డొంకేశ్వర్ మార్చి28: డొంకేశ్వర్ మండలం మారంపల్లి గ్రామంలో సజ్జ పంటలను మండల వ్యవసాయాధికారిణి జోష్నభవాని పరిశీలించారు. సజ్జ పంటకు పిచికారి చేసేటప్పుడు రైతులు ఆకులతో పాటు మొక్క సుడులలో పడే విధంగా స్ప్రే చేయాలని అన్నారు. సజ్జ పంటను కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, ఆకులలోని కాండాలన్ని కొరికి తినడం వల్ల ఆకులపై తెల్లటి పాలు ఏర్పడుతున్నాయని, రెండు, మూడు దశల్లో లద్దిపురుగులు ఆకు సుడిలో ఉండే రంధ్రాలు చేసుకుంటూ తినడం వల్ల విచ్చుకున్న ఆకులలో రంధ్రాలు ఏర్పడి లద్ది పురుగు ఉధృతి పెరుగుతుందని ఆమె తెలిపారు. పురుగు నివారణకు ఎకరానిక పది లింగార్షక బుట్టను ఏర్పాటు చేసుకోవాలని, పురుగు యొక్క నివారణకు క్లోరంత్రా నిలిప్రోల్ 60ఎంఎల్, స్పైనోటోరియం 80ఎంఎల్ మందును ఒక ఎకరానికి 200లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నరేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో గజ్జపూజ మహోత్సవం



మామిడిపల్లిలో గజ్జపూజలో పాల్గొన్న విద్యార్థినులు

ఆర్మూర్‌రూరల్, మార్చి28: ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం గజ్జపూజ మహోత్సవం నిర్వహించారు. నటరాజ నృత్యనికేతన్‌లో శిక్షణ పొందిన చిన్నారులు గజ్జపూజ ద్వారా వేదికలపై తమ నట్యాన్ని ప్రదర్శించనున్నారు. ఆర్మూర్‌లోని శ్రీ బాషిత పాఠశాలలో విద్యార్థులకు క్లాసికల్ డ్యాన్స్ తరగతులను నిర్వహించారు. కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ మాట్లాడుతూ తమ సాంస్కృతి, సాంప్రదాయాలకు సంబంధించిన అన్ని విషయాలను విద్యార్థులకు నేర్పిస్తున్నామన్నారు. విద్యార్థులు వివిధ వేదికలపై తమ నట్యప్రదర్శనలు ఇచ్చి అవార్డులు సాధించారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నటరాజ నృత్యనితకేన్ వ్యవస్థాపకులు మాడవేటి నారాయణ, నృత్యగురువు బాశెట్టి మృణాళిని, విద్యార్థులు, చిన్నారులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో 5కే రన్

పెర్కిట్, మార్చి28: ఆర్మూర్ పట్టణంలో మామిడిపల్లి చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్, అంబేద్కర్‌చౌరస్తా వరకు 5కె రన్ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ అవగాహన పెంపొందించేందుకు గాను ఐ ఓటు ఫర్ షూర్ అంటు విద్యార్థులు, క్రీడాకారులు నినాదాలు చేస్తూ 5కె రన్ చేపట్టారు. అంబేద్కర్ వరకు కొనసాగిన ఈ 5కె రన్‌లో ఆర్డీవో రాజాగౌడ్ విద్యార్థులతో, మున్సిపల్, విద్యశాఖ, రెవెన్యూ సిబ్బందితో ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ బస్వారెడ్డి, తహసీల్దార్ గజనంద్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈవో రాజగంగారాం, రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిరాజ్‌లో ఎయిడ్స్ నివారణపై వర్క్‌షాప్

నిజామాబాద్ అర్బన్, మార్చి 28: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో గురువారం ఎయిడ్స్ నివారణ కార్యక్రమంపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి, విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డితో పాటు రిటైర్డ్ ప్రొఫెసర్ నర్సింహారావు, నర్సింహస్వామిలు హాజరయ్యారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్, రమేష్, సునీత, సతీష్‌కుమార్, డాక్టర్లు కుమారస్వామి, రవిరాజ్, సుమలత, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికలు



ఎన్నికల అధికారులతో గెలుపొందిన బార్ సభ్యులు

నిజామాబాద్ లీగల్, మార్చి 28: జిల్లా బార్ అసోసియేషన్ 2024-25 ఎన్నికలు గురువారం ప్రశాంతంగా నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా ఆమదాల సుదర్శన్, నారాయణదాసు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో మొత్తం 300 మంది ఓట్లు సద్వినియోగం చేసుకోగా, అధ్యక్ష పోటీకి జగన్ మోహన్‌గౌడ్ తన ప్రత్యర్థి సాయిరెడ్డిపై 12 ఓట్లతో గెలుపొందారు. ఉపాధ్యక్ష పదవికి పి.రాజు తన ప్రత్యర్థి శ్రీనివాస్‌గౌడ్‌పై 104 ఓట్లతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు తన ప్రత్యర్థి బాల్‌రాజు నాయక్‌పై 154 ఓట్లతో గెలుపొందారు. కోశాధికారిగా దీపక్, కార్యదర్శిగా ధన్‌పాల్ సురేష్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మహ్మద్ అయ్యూబ్, లైబ్రెరి సెక్రెటరీగా పిల్లి శ్రీకాంత్, మహిళా ప్రతినిధిగా ఏలేటి కవితారెడ్డి, ఎగ్జిక్యూటీవ్ బాడీ మెంబర్స్‌గా శ్రీనివాస్ చక్రవర్తి, బి.శివాజీ, లక్ష్మినారాయణ, డి.రవి, జి.రజిత, ఎ.నారాయణ, విశ్వకోసేన్‌రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ పార్టీలోకి ఐలాపూర్ సింగిల్ విండో చైర్మన్

నందిపేట, మార్చి28: మండలంలోని ఐలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ మీసాల సుదర్శన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర కో ఆపరేటీవ్ యూనియన్ లిమిటెడ్ రాష్ట్ర చైర్మన్ మానాల మోహన్ రెడ్డి సమక్షంలో ఆర్మూర్ నియోజక వర్గం ఇంచార్జీ పొదుటూరి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో సుదర్శన్‌తో పాటు సీనియర్ నాయకులు గంగాధర్, బట్టు సాయిరాం, నవీన్, మూడెడ్ల బాజన్నలు సైతం ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి టి జీవన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, లిఫ్ట్‌చైర్మెన్ భోజారెడ్డి, జిల్లాకాంగ్రెస్ ఉపాధ్యక్షులు పెంట ఇంద్రుడు, రాజు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న దృశ్యం

చెరువు మన్ను..చేనుకు దన్ను



ట్రిప్పర్లద్వారా వివిధ గ్రామాలకు తరలివెళుతున్న నల్లమట్టి

భీమ్‌గల్ రూరల్, మార్చి28: ఈ సంవత్సరం పసుపుకు మద్దతు ధర లభించడంతో బాల్కోండ నియోజక వర్గంలోని రైతులు ఖరీఫ్ లో సాగుచేసే పసుపుపంట దిగుబడిపెంచుకోవడం కోసం చెరువుల నుండి లభించే నల్లమట్టిపై ఆసక్తి కనబరుస్తున్నా రు. చెరువుల నుంచి మట్టిని ట్రిప్పర్లద్వారా తరలిస్తున్నారు. చెరువు మట్టితో భూమి సారవంతం అవుతుందని, చెరువు మట్టితో ఎన్నో లాభాలు వున్నాయని ఎడిఏ మల్లయ్య సూచిస్తున్నారు. భీమ్‌గల్ మండలంలోని ముచ్కూర్ గ్రామంలోని బసిరెడ్డి, నాళ్లచెరువుల నుంచి నల్లమట్టిని తరలిస్తున్నారు.

● చెరువు మట్టిలో పోషకాలెన్నో

గ్రామాల్లో వర్షాధార చెరువులు ప్రస్తుతం అడుగంటిపోతున్నాయి. ఎండిన చెరువుల్లోని 2 నుంచి 3 అడుగుల మేర పేరుకోయిన నల్లమట్టిని పంటభూముల్లో వేసుకోవాలి. చెరువునుంచి తీసిన మట్టిని పంట పొలాల్లో వేయడం ద్వారా ఆపొలాలు సారవంతం అవుతాయి.చెరువుమట్టి లోతును బట్టి అందులోని పోషకాలు ఆధారపడి ఉంటాయి. ఇందులో ఆమ్ల, క్షార తత్వాలతో పాటు పురుగు మందుల అవశేషాలు కూడా ఉండే అవకాశం ఉంటుంది. చెరువు మట్టిలోని పోషకాల స్థాయిని గురించేందుకు మట్టి పరీక్షలు చేయించాలి. నేలకు సరైన మోతాదులో పోషకాలు అందుతాయి. సాధారణంగా చెరువుమట్టిలో 70 శాతం ఒండ్రు, 30 శాతం బంక మట్టి ఉంటుంది. పంటలకు అవసరమయ్యే భాస్వరం, పొటాష్‌లతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా ఉంటాయి. చెరువు మట్టితో పాటు సేంద్రియ ఎరువులను కూడా కలిపి పొలంలో వేసుకోవడం ద్వారా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. మొక్కలు ఆరోగ్యంగా ఎత్తుగా పెరుగుతాయి. పంట దిగుబడి పెరుగుతుంది.

చెరువు మట్టిలో సూక్ష్మ జీవులు ఎక్కువగా వుంటాయి



చెరువు మట్టిలో ఉండే సూక్ష్మపోషకాలు నేలలో పోషకాలను పెంచుతాయి.కరువు, వర్షాభావ పరిస్థితులను సైతం ఎదుర్కోనే శక్తినినేలకు అందిస్తుంది. ఈసంవత్సరం పసుపు పంటకు మద్దతు ధర వుండడంతో రైతులు పసుపు పంట సాగుకు చెరువు మట్టి నల్లమట్టిని తరలించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

- ఏడీఏ మల్లయ్య

కోళ్లఎరువు, గొర్రెల ఎరువులకు పెరిగిన డిమాండ్



పంట సాగు కోసం లారీలో తీసుకు వచ్చిన ఎరువు



పొలంలో వేసిన పశువుల పెడ, మేకల ఎరువు, కోళ్ళ ఎరువు

డొంకేశ్వర్ మార్చి28: పసుపు పంటను వేసేందుకు మండల రైతులు తోటలను సిద్ధం చేస్తున్నారు. పసుపు వేసే మడిలో సేం ద్రీయ ఎరువులను లారీలలో తీసువకువచ్చి పొలంలో చల్లుతున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న పలు గ్రామాల్లో నూత్‌పల్లి, డొంకేశ్వర్, గాదేపల్లి, మారంపల్లి, నికాల్‌పూర్ గ్రామాలలో మేకల, పశువుల ఎరువులను రైతులు తోట భూమిలో వేస్తున్నారు. అయితే పశువుల పెడ, మేకల ఎరువు, కోళ్ల ఎరువు ప్రతీ సంవత్సరం డిమాండ్ పెరుగుతు వస్తోంది. పసుపు సాగు చేస్తున్న రైతులు తెగుళ్ల రాకుండా అరికట్టేందుకు పశువుల ఎరువు ఉపయోగపడుతుండడంతో పశువుల ఎరువు ధరలకు రెక్కలు వచ్చాయి.. గత నెల రోజుల క్రితం రూ.20 వేల వరకు ధర పలికిన లారీ ప్రస్తుతం రూ.35వేలకు చేరింది. ధర రైతులకు ఎక్కువైనప్పటికీ తెగుళ్ల తాకిడికి తట్టుకునే శక్తి ఉంటుం దని రేటుకు వెనుకాడకుండా కొనుగోలు చేస్తున్నారు. డొంకేశ్వర మండలంలో గత సీజన్‌లో 1200ఎకరాల్లో పసుపు సాగైంది. ప్రస్తుత ఏడాది పసుపు రెండు వేల వరకు సాగు పెరిగే అవకాశాలు ఉన్నట్టు వ్యవసాయా. దికారులు అంచనా వేస్తున్నారు.ఈ సంవత్సరం పసుపుకు సరైన ధర రావడంతో రైతులు పసుపు సాగును పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో పసుపు సాగు చేసే రైతులకు వ్యాపారులు బాన్సువాడ, నవీపేట్, సారాపూర్, బోదన్, తదితర గ్రామాల నుంచి మేకల ఎరువు, కోళ్ళ ఎరువు, గేదేలు పేడను లారీల ద్వారా తీసుకు వస్తున్నారు. కోళ్ళ ఎరువు రూ.33వేలు, మేకల ఎరువు రూ.39వేలు దూరం బటిట ఎరువుకు ధరను చెల్లిస్తున్నారు. ఒక లారీకి రూ.39వేల దాకా అవుతుంది. ఒక్క లారీలో ఐదు ట్రాక్టర్ల ఎరువు వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు.పేడ కొరత ఉందని రైతులకు వ్యాపారులు చెబుతూ ఆగం చేస్తున్నారు. దీంతో రైతులు ధర ఎక్కువైన కొనుగోలు చేసేందుకు పోటీపడుతు న్నారు. ఒక ఎకరంలో రెండు లారీ పేడ వేస్తుంటారు. కానీ ధర అమాంతం పెర గడంతో ఒక్క లారీ మాత్రమే రైతులు వేస్తున్నారు. రైతులు సేంద్రీయ ఎరువుల కోసం రూ.45వేలు వరకు రైతులు పెట్టుబడి పెడుతు న్నారు.

● ఎరువుల వల్ల ఉపయోగాలు

పసుపు సాగు చేస్తున్న నేలలో పశువుల పేడ, కోళ్ళ ఎరువు, గొర్రె ఎరువు, గంగామట్టి వేయడం వల్ల మొక్క యొక్క వేరు వ్యవస్థకు అనుకూలంగా ఉంటుంది. సేంద్రీయ ఎరువు వేయడం వల్ల సూక్ష్మ జీవులు పెరుగుతాయి. నత్రజనీ, బాస్వరం, కార్బన్‌శాతం పెరిగి నేడు వ్యవస్థకు గాలి నీరు సరైన సమయానికి చేరి చీడపీడల నుంచి రక్షించుకోవడానికి ఉపయోగపడుతుంది. రైతులకు ఆశించినంత దిగుబడి వస్తుంది.

ఒక్కసారి రేటు పెంచేశారు

గత నెల రోజుల క్రితం రూ.20వేలు ఉన్న లారీ ఇప్పుడు ఏకంగా ఎరువుల కొరత ఉందని వ్యాపారులు చెబుతూ రూ.35వేలకు లారీ పోస్తున్నారు. పసుపుకు రేటు ఉండడంతో వ్యాపారులు అదే అసరాగా చేసుకొని ఎరువుల రేటును ఒక్కసారి పెంచేశారు. ఒక్క ఎకరంకు రెండు లారీల ఎరువు పోసేది కానీ రేటు ఎక్కువగా ఉండడంతో ఒక్క లారీ ఎరువు పోస్తున్నాం.

- మోర్తాడ్ రవి, రైతు, నూత్‌పల్లి

విద్యార్థులు భగత్ సింగ్ ఆశయాలను ఆచరించాలి



టీయూలో మాట్లాడుతున్న ప్రముఖ న్యాయవాది మాధవరావు

డిచ్‌పల్లి, మార్చి 28: దేశంలో సామ్రాజ్య వాదుల దోపిడికి వ్యతి రేకంగా భగత్‌సింగ్ ఉద్యమించాడని భగత్ సింగ్ కోరికలను నేటి పాలకులు విస్మరిస్తున్నారని, ఆయన ఆశయాలను విద్యార్థులు ఆచారణలో ఉంచాలని మానవ హక్కుల వేదిక మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రెపాటి మాధవరావు అన్నారు. కామ్రెడ్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల 93వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ వర్సిటీలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లో వర్సిటీ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వక్తగా హాజరైన గోర్రెపాటి మాధవరావు మాట్లాడుతూ.. భగత్ సింగ్ ఆశయ సాధనకు వర్సిటీ విద్యార్థులు కృషి చేయాలని దేశ సంపద ను కొంత మంది చేతుల్లోనే పెడుతున్నారని ఇండస్ట్రీ సర్వీస్ సెక్టర్ ను ప్రైవేట్‌పరం చేస్తున్నారని విమర్శించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ సరిత మాట్లాడుతూ.. భగత్ సింగ్ 23 ఏళ్ల వయస్సులోనే దేశం గురించి ఆలోచించాడని, నేడు యువత మాత్రం చెడు మార్గంలో పయాణిస్తున్నారని చెడు కు దూరంగా యువత ఉండాలని అన్నారు. శాస్త్రీయ దృక్పధం ప్రతి ఒక్కరు అందిపుచ్చుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, వర్సిటీ కార్యదర్శి జయంతి, నాయకులు మోహిత్, ప్రిన్స్, దేవిక,రవీందర్, అక్షయ్, ఆకాశ్, బిందు, లహరి, నితిన్, వర్సిటీ విద్యార్థులు హాజరయ్యారు.

కర్నాటకలో నిజామాబాద్ జిల్లా దంపతుల ఆత్మహత్య

● జనవరి 4నుంచి లాడ్జిలో నివాసం ● అద్దె చెల్లించలేక.. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

ఖిల్లా (నిజామాబాద్), మార్చి 28 : నిజామాబాద్‌కు చెందిన దంపతులు కర్నాటక రాష్ట్రంలోని సోమవార్‌పేట్‌లో బుధవారం ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ నగరంలోని గాయత్రినగర్‌కు చెందిన మేడవరపు రాజు(50), మేడవరపు స్వాతి(45)లు కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుండేవారు. వీరికి సంతానం లేరు. గత జనవరి 4వ తేదీన వీరిద్దరూ కర్నాటకలోని కొడుగు జిల్లా మడికేరి తాలుక సోమవార్‌పేట్ పట్టణంలో గల సువిద్ లాడ్జ్‌లో నివాసం ఉంటున్నారు. అద్దె మాత్రం సక్రమంగా చెల్లించేవారు. అయితే గత రెండు రోజుల క్రితం వారి వద్ద డబ్బులు అయిపోగా.. డబ్బుల కోసం వారు వారికి తెలిసిన వారికి కాల్ చేసి డబ్బులు కావాలని కోరారు. అయితే అద్దె చెల్లింపునకు తమ వద్ద డబ్బులు లేవని లాడ్జి నిర్వాహకులకు తెలుపగా.. రెండు రోజుల్లో చెల్లించాలని రాజుకు గడువు ఇచ్చారు. దీంతో డబ్బులు ఇస్తామని చెప్పిన రాజు, స్వాతిలు బుధవారం రాత్రి లాడ్జ్ పై నీటిట్యాంక్‌కు నీడ కోసం ఏర్పాటు చేసిన షెడ్‌లోకి వెళ్లి నైలాన్ తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సోమవార్‌పేట్ ఎస్సై రమేష్ తెలిపారు. వారి వద్ద గల ఆధార్ కార్డ్ ఆధారంగా వారు నిజామాబాద్‌కు చెందిన వారుగా గుర్తించామన్నారు. స్వాతి చెల్లెలు భారతి, కొడుకు శరత్‌లు అదే ప్రాంతంలోని సూరలది గ్రామంలో నివాసం ఉంటారని చెప్పారు. వారికి సమాచారం అందించగా.. వచ్చి మృతదేహాలను తీసుకొని వెళ్లినట్లు ఎస్సై వివరించారు.



మృతులు రాజు, స్వాతి

భార్యను చంపిన కేసులో భర్తకు జీవిత ఖైదు

బోధన్ రూరల్, మార్చి 28: భార్యను గొంతు కోసి హత్య చేసిన కేసులో భర్తకు జీవత ఖైదీ విధిస్తూ బోధన్ కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.రవికుమార్ గురువారం తీర్పును వెల్లడించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి, రెంజల్ మండలం నీలా గ్రామానికి చెందిన చికెన్ వ్యాపారి పి.దేవోజీకి మెదక్ జిల్లా నల్లవాగు గ్రామానికి చెందిన మనుబాయితో వివాహం అయింది. కొన్నేళ్ళు బాగానే ఉన్నా మనస్పర్ధలతో గొడవలయ్యాయి. మొదటి భార్య కాన్పు కోసం పుట్టింటికి వెళ్ళిన మణుబాయి అక్కడే భర్తపై కేసు నమోదు చేసింది. కేసు నడుస్తుండగా దేవోజీ విజయ అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. కేసు నడుస్తుండగా మణుబాయి దేవోజీ మళ్ళీ కలిసిపోయారు. ఆమె తిరిగి భర్త దగ్గరకు వచ్చింది. అంత కలిసి జీవిస్తున్న సమయంలో మళ్ళీ గర్భం దాల్చిన ఆమె రెండవ కొడుకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో మళ్ళీ భార్య భర్తల మధ్య గొడవలు మొదలు కావడంతో మరోసారి పుట్టింటికి వెళ్లిపోయిన మణుబాయి భర్తపై మళ్ళీ కేసు కేసు పెట్టింది. మధ్య వర్తుల ద్వారా మళ్ళీ రాజీ పడి భర్తకు దగ్గరకు వచ్చింది. ఈ విషయంలో భార్యపై కోపం పెంచుకున్న దేవోజీ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో చికెన్ కొట్టే కత్తితో 2021 మే 3న భార్య గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోయి నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు అప్పటి సీఐ రవీంద్ర నాయక్, ఎస్ఐ మురళీ కేసు నమోదు చేసి సరైన సాక్షాధారాలను సేకరించి కోర్టుకు సమర్పించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు వాదనలు వినిపించారు. ఈ మేరకు సాక్షాధారాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి జీవిత ఖైదీ శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించారు. జరిమాన చెల్లించ లేని పక్షంలో రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పును వెల్లడించారు. లైజనింగ్ అధికారి శంకర్ ఈ మేరకు వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది రాములు మనోహర్, సీఐ కోల నరేష్, సాయన్న తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న పదోతరగతి పరీక్షలు

● ఇద్దరు ఇన్విజిలేటర్ల తొలగింపు

నిజామాబాద్ అర్బన్, మార్చి 28: జిల్లా వ్యాప్తంగా పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం జిల్లా వ్యాప్తంగా 141 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన బయోలాజికల్ సైన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 22,024 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 21,976 మంది పరీక్షలకు హాజరుకాగా 48 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్షకు జిల్లా వ్యాప్తంగా ఎలాంటి మాస్‌కాపీయింగ్ కేసు నమోదు కాలేదు. అర్గుల్, జక్రాన్‌పల్లి సెంటర్లలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఇన్విజిలేటర్లు జె.సుందర్, జె.సంజీవ్‌కుమార్‌లను విధుల నుంచి తొలగించినట్లు డీఈవో తెలిపారు.డీఈవో దుర్గాప్రసాద్ 6, జిల్లా పరిశీలకులు 5, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 27 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

నేడు నాగేపూర్ సొసైటీ మహజన సభ

నవీపేట,మార్చి28: మండలంలోని నాగేపూర్ సోసైటీ మహజన సభను శుక్రవారం నిర్వహించడం జరుగుతుందని సోసైటీ కార్యదర్శి రమేష్ తెలిపారు. ఉదయం 11గంటలకు ఫకీరాబాద్‌లోని సోసైటీ కార్యాలయం ఆవరణలో చైర్మన్ శైలేష్ రావు దేశ్‌ముఖ్ అధ్యక్షతన జరిగే మహజన సభకు సోసైటీ డైరెక్టర్లు, సంఘం సభ్యులు సకాలంలో హజరు కావాలని ఆయన కోరారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సంహిత ఎంపిక

డిచ్‌పల్లి, మార్చి 28: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(ధర్మారం (బి)) విద్యార్థిని సంహిత జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్ సంగీత గురు వారం అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చిన సంహిత జాతీ య స్థాయికి ఈ నెల 29నుంచి ఏప్రిల్ 1 వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని ఫిజికల్ డైరెక్టర్ నీరాజరెడ్డి తెలిపారు.పీఈటీ జ్యోత్స్న, పాఠశాల సిబ్బంది క్రీడకారినిని అభినందించారు.

ఉపాధి హామీ పనులు అందరికి కల్పించాలి



పంచాయతీ కార్యదర్శికి సూచిస్తున్న ఎంపీడీవో సతీష్‌కుమార్

జక్రాన్‌పల్లి, మార్చి28: ఈ వేసవిలో పనులు అడిగిన కూలీలందరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపీడీవో సతీష్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని కేశ్‌పల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ వేసవికాలం అడిగిన ప్రతీ కూలిలందరికి పనులు కల్పించాలన్నారు. అనంతరం కేశ్‌పల్లి, కేశ్‌పల్లితాండాలో తాగునీటి సరఫరా నిర్వహణను ఆయన పరిశీలించారు. వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఈసీలు రాంబాబు, నిహరిక, ప్రదీప్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, ఫీల్డ్ అసిస్టెంట్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత



సీజ్ చేసిన ట్రాక్టర్

రెంజల్,మార్చి28: మండలంలోని నీలా గ్రామంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో కలిసి నీలా గ్రామ శివారులో ఒక ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సాయన్న హెచ్చరించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

మాక్లూర్ , మార్చి28: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని బోంకన్‌పల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు పశుసంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ కిరణ్‌దేశ్‌పండే తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న వ్యాధి నిరోధక టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో పశువైద్యాధికారిణి ఉమమసాహెర్, పశువైద్య సిబ్బంది, తదితరులు పాల్గొ న్నారు.

35 కుర్చీలను వితరణ చేసిన పూర్వ విద్యార్థులు

సిరికొండ మార్చి 28: గడ్కోల్ హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులు 35 కుర్చీలను ఉచితంగా అందజేసి తాము సైతం పాఠశాల కోసం అంటు ఉదార స్వభావాన్ని చూపించారు. సిరికొండ మండలం గడ్కోల్ హైస్కూల్లో 2009 -2010లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు ఎంతో కొంత సహాయాన్ని అందజేద్దామని ముందుకు వచ్చారు.అనుకున్నదే తడవుగా తల ఇంత డబ్బులు జమా చేసి 35 కుర్చీలను కొనుగోలు చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.సుమారు పదహారు వేలు వెచ్చించి కుర్చీలను కొనుగోలు చేసి పాఠశాలకు అందజేశారు.ఒడ్డెం ప్రశాంత్,నరహరి తదితరులు పాల్గొన్నారు.


చికిత్స పొందుతూ మహిళ మృతి

నవీపేట,మార్చి28: మండల కేంద్రానికి చెందిన శివరాశి చంద్రకళ(65)అనే మహిళ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందిందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. గత వారం మండలంలోని నందిగామలో బంధువుల అంత్యక్రియల కోసం భార్యాభర్తలు బక్కన్న, చంద్రకళలు వెళ్లారని, తిరిగి నందిగామ నుండి యంచ వరకు ఆటో వచ్చారు. ఆటో దిగుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో చంద్రకళకు తీవ్ర గాయాలయ్యాయని వెంటనే ఆమెను జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందిందని ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త బక్కన్న, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికెన్ గున్యాకు ప్రధాన కారణం మంచి నీరేనా!?

డిచ్‌పల్లి, మార్చి 28: మండలంలోని నడిపల్లి గ్రామంలో చికెన్ గున్యా వ్యాధి గ్రస్తులు అధికమవుతుండటంతో గ్రామస్థులు ఆందోళనకు గురి అవుతున్నారు. గ్రామంలో పారిశుధ్యలోపం తాగునీటి సరఫరాలో క్లోరినేషన్ లేక నీటి కారణంగా కీళ్ల నొప్పులు, ఎముకల నొప్పులు అధికమవుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన శేఖర్, రంజిత్, సాయిలు, రాజేందర్, సుమలత, సుజాత, రవి, సుమ, సంతోశ్, వెంకటస్వామి, సుదర్శన్, కవిత లు చికెన్ గున్యా భారిన పడి అస్వస్థతకు గురి అయ్యారని ఈ వ్యాధి సోకిన వారికి ముక్కు, ముఖభాగం నల్లబడటంతో పాటు కీళ్ల నొప్పులతో నడవలేని పరిస్థితినెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. జిల్లా వైద్యశాఖ అధికారులు వ్యాధి గ్రస్థులను గుర్తించి వెంటనే ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసేల చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డిని కలిసిన నేతలు



బాజీరెడ్డి గోవర్ధన్‌ను కలిసిని మండల బీఆర్ఎస్ నాయకులు

ఎడపల్లి,మార్చి 28: ఎడపల్లి మండల ఎంపీపీ, ఎంపిటిసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గురు వారం బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజీరెడ్డి గోవర్ధన్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో నిజామాబాద్ ఎంపీగా బాజీరెడ్డి గోవర్ధన్ గెలుస్తారని, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ఆయన గెలుపునకు కృషి చేస్తామని వారు అన్నారు. ఆయనను కలిసిన వారిలో ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్, ఎంపిటిసి సంజీవ్, మాజీ ఎంపీపీ గైనీ పోచయ్య, మాజీ సర్పంచ్‌లు భట్టు హన్మాండ్లు, దశరథ్, నాయకులు ఇస్తారి, సురేష్, నాగేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గౌరీ సమేత ఓంకారేశ్వరస్వామి కల్యాణం

కామారెడ్డి టౌన్, మార్చి 28: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జయశంకర్ కాలనీలో గల శ్రీగౌర సమేత ఓంకారేశ్వరాలయంలో ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా ఆలయంలో ప్రధాన అర్చకుడు అవినాష్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ హాజరయి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం పల్లకి సేవ, విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కలిల ప్రభాకర్, వీరన్నపటేల్, అంజనేయులు, శివరాములు, పటేల్‌రాజు, శెవెళ్ల రాజు, ఇంద్రశేఖర్, శకరప్ప, జీవన్‌దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

బిచ్కుంద, మార్చి 28: బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రోమైండ్ స్కిల్స్ క్యాటలిస్ట్, కళాశాల ఐక్యుఏసీ విభాగం ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించారు. జుక్కల్ నియోజకవర్గంలోని నిరుద్యోగులు, కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థులు ఈ జాబ్‌మేళాకు పెద్దఎత్తున హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కంపెనీ ప్రతినిధులు గంగాధర్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారావుపేట కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

సదాశివనగర్, మార్చి 28: ధర్మారావుపేట గ్రామ కాంగ్రెస్ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు జుకంటి సంగారెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా ఏనుగు సంజీవరెడ్డి, ఉపాధ్యాక్షుడిగా సన్నాయిల సాయిలు, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్, కార్యదర్శిగా ఆటో బాబా, కోశాధికారిగా రాజశేఖర్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా ప్రశాంత్, మైనార్టీ అధ్యక్షుడిగా ఇస్తకార్, బీసీ అధ్యక్షుడిగా లక్ష్మణ్, ఎస్‌సీ అధ్యక్షుడిగా దాకయ్య, రైతు విభాగం అధ్యక్షుడిగా గోపి, యూత్ అధ్యక్షుడిగా నవీన్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బడాల భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి ప్రత్యేక కృషి

తాడ్వాయి, మార్చి 28: గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. తాడ్వాయి మండలం దేమికలాన్, కన్కల్, కరడ్‌పల్లి గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గ్రామాలు గతంలో కాంగ్రెస్ పార్టీకి పూర్తిగా అండదండగా నిలిచేవని తెలిపారు. గత ప్రభుత్వం వైఫల్యాల కారణంగా ప్రజలు నాయకులు కాంగ్రెస్ వైపునకు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. మూడు గ్రామాల్లో గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. దేమికలాన్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పుట్ట రమేష్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, కన్కల్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా భూపతిరెడ్డి, ఉపాధ్యాక్షుడిగా సాకలి బాలరాజ్, కరడ్‌పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాజప్పలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దిమహేందర్‌రెడ్డి, శ్యామ్‌రావు, జంగం రాజు, వెంకట్‌రెడ్డి, భూపతిరెడ్డి, కిష్టారెడ్డి, దేమికమ్మరి రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై దాడికి పాల్పడిన వారిపై కేసు

పెద్దకొడప్‌గల్, మార్చి 28: విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు బిచ్కుంద ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ మోహన్ రెడ్డి కథనం ప్రకారం.. పెద్ద కొడప్‌గల్ ఎస్ఐ కోనారెడ్డితో పాటు, పోలీసులు బుధవారం సాయత్రం బేగంపూర్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కాస్లాబాద్ గ్రామానికి చెందిన వ్యక్తులు మద్యం తాగి వచ్చి వాహనాలు తనిఖీ చేసే అధికారం మీకు ఎవరిచ్చారంటూ ఎస్ఐ కోనారెడ్డితో పాటు, పోలీసులపై దాడి చేశారని తెలిపారు. దీంతో ఎస్ఐ కోనారెడ్డి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, ఉన్నతాధికారులు విచారణ అధికారిగా బిచ్కుంద ఎస్ఐ మోహన్‌రెడ్డిని విచారణ అధికారిగా నియమించారు. దీంతో కేసును విచారించి పోలీసులపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించనట్లు ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేవైఎం నాయకులు

మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

సదాశివనగర్, మార్చి 28: హోలీ పండుగ రోజున చెంగిచర్లలోని ఓ మహిళపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేవైఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. మహిళలపై దాడులు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శులు ఏనుగు సంజీవరెడ్డి, రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పిల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తు.. యువత చిత్తు!

● మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న జిల్లా యువత ● యుక్త వయసులోనే అనారోగ్యంపాలవుతున్న వైనం ● రహస్య ప్రాంతాల్లో గంజాయి సిగరెట్ల అమ్మకాలు?

బాన్సువాడ టౌన్, మార్చి 28: బాగా చదువుకుని భవిష్యత్తును బంగారు మయం చేసుకోవాల్సిన జిల్లాలోని పలువురు గంజాయి మత్తులో జీవితాన్ని చిత్తు చేసుకుంటున్నారు. గంజాయికి బానిసలుగా మారి బంగారు భవితను చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. కుటుంబానికి, గ్రామానికి మంచిపేరు తెస్తారని తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారు. నేటి యువత చదువుపై శ్రద్ధతగ్గించి చెడు అలవాట్లకు బానిసలుగా మారిపోతోంది. కొందరు యువకులు ఖరీదైన బైక్‌లు, జల్సాలు చేసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. పట్టణాలకే పరిమితమైన మత్తుదందా నేడు పల్లెలకు కూడా పాకింది. బాన్సువాడ పట్టణంలో కూడా యువత గంజాయి మత్తుకు బానిసలుగా మారుతున్నట్లు సమాచారం. రహస్య ప్రాంతాలలో యువత గంజాయి సిగరెట్లను కాల్చుతున్నట్లు తెలుస్తోంది. రాత్రివేళల్లోనే గంజాయి వ్యాపారులు యువతనే టార్గెట్ చేసి అక్రమ దందాకు తెరలేపుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

యుక్త వయస్సులోనే అనారోగ్యం పాలు..

యువత మత్తుకు బానిసలుగా మారుతూ అనారోగ్యాల పాలవుతున్నారు. ఉత్సాహంతో ఉరకలెత్తాల్సిన జవసత్వాలు సన్నగిల్లుతున్నాయి. మత్తు, మద్యం, ధూమపానంతో యుక్త వయస్సులోనే అనారోగ్యం పాలవుతున్నారు. ఆరోగ్యం ఛిద్రమైన బాధితుల్లో గంజాయి సిగరెట్లకు అలవాటు పడిన వారే ఎక్కువగా ఉంటున్నట్లు సమాచారం. కొంతమంది వ్యాపారులు కళాశాల, పాఠశాల విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని వారిని మత్తులో దించుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మత్తులో యువత తమ బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నాయని మేధావులు అభిప్రాయ పడుతున్నారు.



రహస్య ప్రాంతాల్లోనే అమ్మకాలు

గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల అమ్మకాలపై పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. కానీ కొంతమంది వ్యాపారులు పోలీసుల కళ్లు గప్పి తమ వ్యక్తిగత వాహనాలపై రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. డబ్బు సంపాదనే ధ్యేయంగా అక్రమార్కులు ఈ దందాపై దృష్టి సారిస్తున్నారు. రహస్య ప్రాంతాలు, రహస్య ప్రాంతాలను ఎంచుకుని సాయంత్రం నుంచి రాత్రి వరకు గంజాయిని యువతకు చేరవేస్తున్నట్లు తెలుస్తోంది.

బాన్సువాడలో..

బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో గంజాయి సిగరెట్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నట్లు సమాచారం. కళాశాల విద్యార్థులు , యువత గంజాయి మత్తుకు బానిలుగా మారుతున్నారు. రాత్రి వేళలో నిర్మానుష్య ప్రాంతాలలో గంజాయి సిగరెట్లను కాల్చుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గంజాయి విక్రయాలపై పోలీసుల నిఘా ఉన్నప్పటికీ మరింత కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మత్తు పదార్థాల రవాణా చేస్తున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

● 13 లక్షల 31 వేల సొత్తు రికవరీ ● అరెస్టు, రిమాండ్: బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ

బాన్సువాడ, మార్చి 28 జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండల కేంద్రంలో ఈనెల 26న జరిగిన చోరీ కేసును 24 గంటల్లో పోలీసులు ఛేదించారు. చాకచక్యంగా వ్యవహరించి అనుమానితుడిని అదుపులోకి తీసుకొని ఎస్సై శ్రీకాంత్ విచారణ జరిపి చోరీ మిస్టరీని ఛేదించినట్లు డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. అధికారి మాట్లాడుతూ మద్నూర్ మండలానికి చెందిన మహజన్ బాలాజీ ఇంటిలోకి చొరబడిన ఉప్పరివార్ శ్రీనును అనుమానాస్పదంగా కనిపించడంతో రాత్రి వేళలో అదుపులోకి తీసుకొని దర్యాప్తు జరిపించారని వివరించారు. దాంతో చోరీ జరిగిన ఉదాంతాన్ని ఉప్పరివార్ శ్రీను వెల్లడించడం జరిగిందన్నారు. ఈ విచారణలో 15తులాల బంగారు ఆభరణాలు, 10తులాల బంగారు బిస్కెట్, 16వేల నగదును రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. వివరాలను సేకరించిన అనంతరం సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేయడం జరుగుతుందని వివరించారు. చోరీ కేసును ఛేదించిన పోలీసులను డిఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద సీఐ నరేష్, ఎస్ఐ శ్రీకాంత్, కానిస్టేబుళ్లు సాయిబాబా, సాయిలు, యాసిన్ ఉన్నారు.



సమావేశంలో నిందుతున్ని చూపుతున్న డీఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఎన్నికల అధికారి

మద్నూర్, మార్చి 28: మండలం సలాబత్‌పూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఉన్న ఎన్నికల తనిఖీ కేంద్రాన్ని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండురాష్ట్రాల మధ్య డబ్బు, మద్యం సరఫరా కాకుండా ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి వస్తున్న ఆర్టీసి బస్సులను తనిఖీ చేయాలని ఆదేశించి సలహాలు, సూచనలు అందజేశారు. జుక్కల్ చౌరస్తాలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల తనిఖీలు పరిశీలించి, వాహనాల తనిఖీలో పాల్గొన్నారు. ఆయనతో పాటు మద్నూర్ తహసీల్దార్ ముజీబ్, జూనియర్ అసిస్టెంట్ రవి తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

పెద్దకొడప్‌గల్, మార్చి28: జుక్కల్ మండలంలోని ఖండె బల్లూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెడిడెంట్ వినోద్ తెలిపారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్ పాటిల్, రాజేందర్ సింగ్, కొమ్మురాజు, కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై యువకుడి దాడి

రామారెడ్డి, మార్చి28: రామారెడ్డి పోలీసుస్టేషన్‌లో ఓ యువకుడు పోలీసులపై దాడిచేసినట్లు ఎస్సై కొండవిజయ్ తెలిపారు. రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన రవి బుధవారం రాత్రి తల్లిదండ్రులతో గొడవపడి పోలీసుస్టేషన్‌కు వచ్చాడు. విధుల్లో ఉన్న ఏఎస్సై ప్రభాకర్, కానిస్టేబుల్ సిద్దిరాములుతో దురుసుగా ప్రవర్తించడంతో పాటు పోలీసుస్టేషన్‌లో టేబుల్‌పై ఉన్న అద్దాలను, డోర్‌ను ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు. పగిలిన అద్దంతో కానిస్టేబుల్ సిద్దిరాములు చేతికి గుచ్చినట్లు తెలిపారు.

జహీరాబాద్‌లో బీజేపీ జెండా ఎగురవేద్దాం

మాజీ ఎంపీ బీబీ పాటిల్

మద్నూర్, మార్చి 28: జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఈ సారి భారతీయ జనతా పార్టీ జెండా ఎగురవేద్దామని జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. గురువారం నిజాంసాగర్ నుంచి మద్నూర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో బీబీ పాటిల్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేద్దామన్నారు. పీఎం నరేంద్రమోదీ, కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలే బలమని, వారితోనే గెలుపు సాధ్యమన్నారు. జుక్కల్ మారుమూల నియోజకవర్గానికి రోడ్డు మార్గం హైవే 161ని ఇచ్చిన కేంద్ర ప్రభుత్వంలో బీజేపీని గెలిపించాలన్నారు. ప్రతీ కార్యకర్త గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను తెలపాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు కుమారి అరుణతార, నాయకులు అలె భాస్కర్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, మండల బీజేపీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్‌లో బైక్ ర్యాలీ

పెద్ద కొడప్‌గల్: పెద్ద కొడప్‌గల్ మండలంలో గురువారం బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బీజేపీకి చెందిన జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షురాలు అరుణతార తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ నిజాంసాగర్ మండలం బొగ్గు గుడిసె నుంచి ప్రారంభమై మద్నూర్ వరకు కొనసాగినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఈ ర్యాలీలో కార్యకర్తలు పెద్ద ఎత్తున మోటార్ సైకిళ్లతో పాల్గొన్నారు.



మద్నూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మండలం గుండా ఈ ర్యాలీ సాగగా వాహనంపై నుంచి ఎంపీ పాటిల్ మండల ప్రజలకు అభివాదం చేశారు. దీంతో బీజేపీ శ్రేణులు నాయకుల వాహనాన్ని అనుసరిస్తూ మద్నూర్‌కు బయలు దేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కాలకుంట్ల రాము, శ్రీధర్ పంతులు, బాలాజీ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో టెక్నికల్ సమస్యను పరిష్కరించాం

● ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమేష్‌బాబు

భిక్కనూరు, మార్చి28: మండలంలోని కాచాపూర్ సబ్‌స్టేషన్‌లో నెలకొన్న టెక్నికల్ సమస్యను పరిష్కరించడం జరిగిందని ఎస్‌ఈ రమేష్‌బాబు తెలిపారు. గురువారం కాచాపూర్ సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్‌లో టెక్నికల్ సమస్యతో కొంతఇబ్బంది ఏర్పడి విద్యుత్ సమస్య తలెత్తిందని, తమ సిబ్బంది సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఈ సాయిలు, ఏడీఈ కిరణ్‌చైతన్య, ఇంచార్జి ఏఈ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



డోంగ్లీలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

మద్నూర్, మార్చి 28: మార్క్‌ఫెడ్, నాఫెడ్‌ద్వారా రైతుల నుంచి పొద్దు తిరుగుడు గింజల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రేణుక తెలిపారు. డోంగ్లీ సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో సిబ్బంది ఉన్నారు.

ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలి

● ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డి, మార్చి28: ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకొని ఓటింగ్ శాతాన్ని పెంచాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్ అన్నారు. గురువారం ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో గోడలపై స్వీప్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే తహసీల్దార్ కార్యాలయంలో గురువారం గ్రాఫిటీ నిర్వహించారు. ఈ సంధ్బరంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అన్నిప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలని అన్నారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటును నిర్భయంగా వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్డీవో మన్నే ప్రభాకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, రెవెన్యూ సిబ్బంది శ్రీనివాస్, శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి వాహనం బోల్తా.. పది మందికి గాయాలు

లింగంపేట, మార్చి 28: మండలంలోని లింగంపల్లి గ్రామ శివారులో గురువారం పెండ్లి వాహనం బోల్తాపడి పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని లింగంపల్లి (ఖుర్దు)కు చెందిన కొత్త కిషన్ కుమారుని వివాహానికి వచ్చిన బంధువులను లింగంపల్లి నుంచి జీఎస్ఆర్ గార్డెన్‌కు గూడ్స్ ఆటోలో తరలిస్తుండగా ఫంక్షన్‌హాలు సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డవారి వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపల్లికి చెందిన కొత్త సవిత్రి, కొత్త ఆదిత్య, కొత్త రాములు, సావిత్ర, శ్రీవర్షా, కొత్త కిషన్, వడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన తిరుపతి, రాజేశ్వర్, రెడ్డిపేట లక్ష్మీ, గాంధారికి చెందిన గోరంచ అంజవ్వ, రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మండలంలో గత 10 రోజుల వ్యవధిలో రెండు ప్రమాదాలు వివాహానికి వెళ్లి వస్తూ బాయంపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా 10 మందికి గాయాలయ్యాయి. వివాహానికి వెళ్తూ మరో ప్రమాదం జరిగాయి. ఆటోల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. శుభకార్యంలో సంతోషంగా ఉండాల్సిన సమయంలో ప్రమాదాలు జరిగి విషాదాలు చోటు చేసుకుంటున్నాయి.



లింగంపల్లి వద్ద బోల్తాపడ్డ ఆటో

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- రజాకార్, ఆడు జీవితం
శాంతి	- ప్రేమలు
ప్రియా 70	- గాడ్జిల్లా ఎక్స్ కింగ్
ప్రియా 35	- ఓ భీం బూష్

బాన్సువాడ

మహేశ్వరి	- టిల్లు స్క్వేర్
వెంకటేశ్వర	- రజాకార్

చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210